వెల్లివిరిసిన మతసామరస్యం


విద్యుత్ కాంతులతో ఒంటెపై గంధం ఊరేగిస్తున్న ఉర్సు నిర్వాహకులు


పార్వతీ మహేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- ప్రారంభమైన అజహరత్ అబ్బాస్ దర్గా ఉర్సు
- ఉర్సుతో పాటు మహేశ్వరుడి కల్యాణానికి పోటెత్తిన భక్తజనం
- భక్తి శ్రద్ధలతో గంధం ఊరేగింపు


పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చింతపల్లి : నల్లగొండ ఉమ్మడి జిల్లాలో రెండో జాన్ పహాడ్‌గా పేరుగాంచిన మండల పరిధిలోని పీకే మల్లేపల్లిలోని అజహరత్ అబ్బాస్ దర్గా ఉర్సు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణానికి బుధవారం రాత్రి భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి 11గంటల నుంచి గురువారం ఉదయం 5గంటల వరకు ఒంటెపై గంధం ఊరేగింపు కన్నుల పండువగా కొనసాగింది. భక్తులతో దర్గా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. కొండపై కొలువుదీరిన మక్కా మహేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా సాగింది. దర్గా కింది భాగంలో ఉర్సు ఉత్సవాలు వైభవంగా సాగాయి. భక్తులు గుట్టపై మక్కా మహేశ్వరుడిని దర్శించుకొని కింద భాగంలో ఉన్న అజహరత్ అబ్బాస్ దర్గాను దర్శించుకోవడం ఇక్కడి ఆనవాయితీ. హిందూ–ముస్లింలు ఐక్యతగా ఈ ఉత్సవాలను ఒకే చోట నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ ఉత్సవాల్లో భాగంగా బుధ, గురు, శుక్రవారాలు భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంది. ఈ ఉత్సవాలకు నల్లగొండ జిల్లా నుంచే కాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, నాంపల్లి సీఐ జలేందర్‌రెడ్డి, చింతపల్లి, మర్రిగూడ ఎస్‌ఐలు యాదయ్య, రంగారెడ్డిలు, సిబ్బంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు. పలువురు ఐఏఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మత సామరస్యానికి ప్రతీక

మండలంలోని పికె.మల్లేపల్లి అజహరత్ అబ్బాస్ దర్గా మత సామరస్యానికి ప్రతీక అని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే, బిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దర్గా వద్ద, మక్కా మహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కంకణాల ప్రవీణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గోపిడి కిష్టారెడ్డి, విద్యాసాగర్‌రావు, ఉజ్జిని నరేందర్‌రావు, అక్రమ్‌యాదవ్, దర్గా కమిటి చైర్మన్ కెవి. రమేశ్‌రాజు, సయ్యద్‌పాషా పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

త్రిపురారం : విద్యుత్ మరమ్మతుల కారణంగా మిర్యాలగూడ సబ్ స్టేషన్ నుంచి వచ్చే 33 కేవీ పరిధిలో త్రిపురారం మండలంలోని త్రిపురారం, పెద్దదేవులపల్లి, మాటూర్, నీలాయిగూడెంలలో గురువారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు త్రిపురారం విద్యుత్ ఏఈ రవీందర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగే గ్రామాల్లో విద్యుత్ విని యోగదారులకు సహకరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా ఇసుక ట్రాక్టర్‌ను గురువారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపిన ప్రకారం.. దేవరకొండ నుంచి కొండమల్లేపల్లి వైపుకు అక్రమంగా ఇసుక లోడుతో వస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకొని ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల నిర్వహణ కమిటీ ఎన్నిక

మిర్యాలగూడ టౌన్ : 2024–25 సంవత్సరానికి గాను కార్పెంటర్స్ యూనియన్ ఎన్నికల నిర్వహణ కమిటీని ఏడుగురు సభ్యులతో గురువారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ కన్వీనర్‌గా మట్టోజు వెంకటాచారి, సభ్యులుగా ఈశ్వరాచారి, పెంటపాడు వెంకన్న, చామర్తి వెంకటాచారి, పామోజు సోమాచారి, దేవులపల్లి కోటాచారి, సలువోజు వెంకటరమణాచారిలను ఎన్నుకున్నారు. ఈ కమిటీ మార్చి 6వ తేదిన జరిగే కార్పెంటర్స్ యూనియన్ ఎన్నికలను నిర్వహించనున్నారు. ఈనెల 23, 24వ తేదీల్లో నామినేషన్ల స్వీకరణ, 25న నామినేషన్ల పరిశీలన, 26న సాయంత్రం వరకు నామినేషన్ల ఉపసంహరణ, 27 నుంచి మార్చి 4వ తేదీ వరకు ప్రచారం, 5వ తేదీ ప్రచారం ముగింపు, 6వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, సాయంత్రం 5గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుందని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీలకు కేటాయించాలి

దేవరకొండ : దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్‌ను ఎస్సీలకు రిజర్వ్ చేయాలని డీవైజేఏస్ చైర్మన్ ఎర్ర కృష్ణ జాంభవ్ కోరారు. గురువారం దేవరకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవరకొండ ప్రాంత ప్రజల ఆకాంక్ష మేరకు మార్కెట్ కమిటీ స్థానాన్ని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని కోరారు. ఈ విషయమై ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో నూనె సురేష్, మద్దిమడుగు మధు, చాట్ల లింగం, కొమ్ము రాజశేఖర్, మున్నా, శేఖర్ పాల్గొన్నారు.


ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా రఘునాథ్

మిర్యాలగూడ అర్బన్ : ఆరెకటిక సంఘం అధ్యక్షుడిగా డబ్బికార్ రఘునాథ్ ఎన్నికయ్యారు. గురువారం ఆ సంఘం భవనలంలో నిర్వహించిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బాలాజీ, భానుప్రకాశ్, కార్యదర్శిగా గణేష్, సహాయ కార్యదర్శిగా రాజు, రమేష్, ప్రభాకర్‌ల ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రఘునాథ్ మాట్లాడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని, ఆరెకటికల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం పోరాటాలు చేస్తామన్నారు. తన ఎన్నకకు సహకరించిన సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

29వ తేదీలోగా ఈ- కేవైసీ చేయించుకోవాలి

డిండి : రేషన్ కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఈనెల 29వ తేదీ లోపు రేషన్ షాపుల వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ హన్మంతు శ్రీనివాస్‌గౌడ్ సూచించారు. గురువారం మండల పరిధిలోని వీరబోయనపల్లి, సింగరాజుపల్లి గ్రామాలలోని ఆఫ్‌లైన్ రేషన్ షాపుల వద్ద ఈ కేవైసీ చేయడానికి ఏర్పాటు చేసిన సెంటర్లను పరిశీలించి రేషన్ లబ్ధిదారులతో ఆయన మాట్లాడారు. సందర్భంగా దూర ప్రాంతంలో ఉంటున్న రేషన్ లబ్ధిదారులు మీ సమీపంలో ఉన్న రేషన్ దుకాణంలో ఉంచిన ఈ పాస్ మిషన్‌లో వేలి ముద్రను వేసుకోవచ్చునని పేర్కొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ పాండమ్మ, జెడ్పీటీసీ భారతి

త్రిపురారం : మండలంలోని మాటూర్ గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 5 లక్షలతో నిర్మిసిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు గురువారం ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ భారతిలు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు భాస్కర్ నాయక్, వెంకట్రాం నాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి


ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

మిర్యాలగూడ : మండలంలోని అవంతీపురం గ్రామ పంచాయతీలో రూ.30లక్షల అవినీతి, అక్రమాలకు పాల్పడిన గత పంచాయతీ కార్యదర్శి మదన్‌మోహన్‌పై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వస్కుల మట్టయ్య అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవంతీపురం గ్రామ పంచాయతీ రికార్డులను ఆడిట్ చేయగా రూ.30లక్షల అవినీతి జరగగా వెంటనే డీపీఓ స్పందించి వెంటనే విచారణ జరపాలని ఆదేశించగా ఇప్పటి వరకు కార్యదర్శి మదన్‌మోహన్ నుంచి రికవరి చేయలేదన్నారు. ఇప్పటికైనా గతంలో పనిచేసిన గ్రామ కార్యదర్శి మదన్‌మోహన్ నుంచి అట్టి నగదును రికవరి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోతుగంటి కాశి, వస్కుల సైదమ్మ, రామాంజి జ్యోతి, మోహన్ నాయక్, ఆశీర్వాదం, వీరయ్య, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే గుర్తింపు


రమేశ్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్ : పార్టీ కోసం నిరంతరం పని చేసిన వారికి మాత్రమే బీజేపీలో గుర్తింపు ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం పట్టణంలోని హౌసింగ్‌బోర్డులోని పార్టీ కార్యాలయంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికా ప్రతినిధిగా ఎంపికైన ఎడ్ల రమేష్‌కుమార్‌ను బీజేవైఎం అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పెదమాం భరత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రమేశ్‌కుమార్ నియామకవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ బణావత్ రతన్‌సింగ్‌నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సత్యప్రసాద్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బంటు సైదులు, దళిత మోర్చా జిల్లా కార్యదర్శి మంద శివ, యువ మోర్చా పట్టణ ఉపాధ్యక్షులు మొదల అశోక్, నరేష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రివర్ ఆస్పత్రిపై డీఎంహెచ్‌ఓకు ఫిర్యాదు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని రివర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అవంతీపురం గ్రామానికి చెందిన మిట్టగనువుల ప్రవీణ్‌కుమార్ గురువారం డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలకు ఫిర్యాదు చేశారు. బాధితుడు ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గతేడాది మే 6న నాకు ఒంటినొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకున్నా. అక్కడ వైద్యులు గుండె సంబంధిత వ్యాధి ఉందని స్థానిక రివర్ ఆస్పిత్రికి తరలించారు. అక్కడ ఎమర్జెన్సీ వార్డులో ఉంచి పరీక్షల నిర్వహించి గుండెకు నాలుగు స్టంట్‌లు వేయాలని రూ.3 లక్షల 40వేలు తీసుకున్నారు. ఆ తరువాత యంజియోగ్రాం పరీక్షలు చేయకుండా నాలుగు స్టంట్లు వేశామని చెప్పి డిశ్చార్జ్ చేశారు. తిరిగి కొద్ది రోజుల తరువాత గుండె నొప్పి రావడంతో అదే ఆస్పత్రికి వెళ్లగా మరల పరీక్షల పేరుతో రూ.16 వేలు తీసుకున్నారు. అప్పుడు యాంజియోగ్రాం చేయాలని చెప్పడంతో అనుమానం వచ్చి ఖమ్మంలోని క్యూర్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు కున్నాను. ఆ వైద్యులు కేవలం ఒక్క స్టంట్ మాత్రమే వేశారని, అదికూడా డ్యామేజ్ అయిన గుండె నరానికి కాకుండా మంచిగా ఉన్న మరో నరానికి వేశారని అక్కడి వైద్యులు చెప్పారని, తిరగి హైదరాబాద్‌లోని మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వారు అలాగే చెప్పడంతో అక్కడే వైద్యం చేయించుకున్నాను. స్టంట్ల పేరుతో తమలాంటి పేదవారిని దోచుకుంటున్నా రివర్ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

పెద్దఅడిశర్లపల్లి : లైన్‌మెన్ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు అయిన సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. గుడిపల్లి ఎస్‌ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం మండలంలోని అంగడిపేట సబ్ స్టేషన్ వద్ద విధులు నిర్వహిస్తున్న లైన్‌మెన్ శేఖర్‌కు మండలంలోని దుబ్బతండాలో కరెంటు స్తంభంపై మంటలు చెలరేగుతున్నాయని సమాచారం రాగా లైన్‌మెన్ వెంటనే దుబ్బతండాకు వెళ్లి విధులు నిర్వర్తిస్తుండగా రమావత్ లక్ష్మా లైన్‌మెన్‌ను అకారణంగా దూషిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. లైన్ మెన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

దేవాలయంలో పూజలు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుంభం శ్రీనివాస్‌గౌడ్, రమావత్ తులసీరాం, రమావత్ దీప్ల, నేనావత్ భద్రు, రమేశ్, బొడ్డుపల్లి కృష్ణ, జవహర్‌లాల్, ఆలయ వ్యవస్థాపకులు సాల్వది ధనిష్ట, సుశీల, భక్తులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌ఎస్‌యూఐది కీలకపాత్ర

మిర్యాలగూడ : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్ఎస్‌యూఐ నాయకులు కీలకపాత్ర పోషించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరిప్రసాద్ అన్నారు. గురువారం పట్టనంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో రెండు ఎంపీ స్థానాలు భారీ మెజార్టీలో గెలిచేలా కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరునా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ జిల్లాకు వచ్చి ఎన్ఎస్‌యూఐ నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సాయిచరణ్, హనుమయ్య, సతీష్, రాము, పవన్, రమేష్, కిరణ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మిర్యాలగూడ టౌన్ : మండలం జప్తీవీరప్పగూడెంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ప్రజాప్రతినిధులుగా, అధికారులుగా వ్యవహరించారు. మంచి ప్రతిభాను కనబరిచిన విద్యార్థులను పాఠశాల బృందం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనంతరెడ్డి, ఉపాధ్యాయులు చిన వెంకన్న, కవిత, శ్రవణ్ తదితరులున్నారు.

అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు


మిర్యాలగూడ : మీనాక్షి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని ఆశీర్వదిస్తున్న అర్చకుడు

అడవిదేవులపల్లి : గ్రామంలోని మహిషాసురమర్ధిని అమ్మవారు, అంకాలమ్మ, ముత్యాలమ్మ ప్రథమ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా మహాయజ్ఞం, పూర్ణాహుతి, కుంభాభిషేకంతో పాటు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహా శివరాత్రి సందర్భంగా బౌద్ధమ దేవాలయాల వద్ద ఏర్పాట్లు సక్రమంగా ఉండాలన్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా పార్కింగ్, విద్యుత్, మంచినీటి సౌకర్యంతో పాటు తదితర వసతులను ఏర్పాటు చేయాలని ఆలయ కమిటీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాదిల శ్రీనువాస్, బాలునాయక్, నాగేశ్వర్ రావు, హనుమయ్య, శ్రీనివాస్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మీనాక్షి అగస్తేశ్వరాలయంలో..

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వాడపల్లి కృష్ణానది తీరంలోగల శ్రీ మీనాక్షి అగస్తేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రానున్న మహాశివరాత్రి వేడుకలకు వచ్చే భక్తులకు కావాల్సిన ఏర్పాట్లపై ఆలయ కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. మహాశివ రాత్రి రోజు ఆలయానికి వచ్చే భక్తులకు పార్కింగ్, స్నానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రహమంతాపూర్‌లో ఎస్‌బీఐ సీఎస్‌పీ ప్రారంభం


సీఎస్‌పీని ప్రారంభిస్తున్న ఏజీఎం సన్యాసిరాజు

డిండి : మండల పరిధిలోని రహమంతాపూర్ గ్రామంలో ఎస్‌బీఐ సీఎస్‌పీ (కస్టమర్ సర్వీస్ పాయింట్)ను గురువారం ఏజీఎం సన్యాసిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గ కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌కు రహమంతాపూర్ దాదాపు 25కిలోమీటర్ల దూరంలో ఉందని, ప్రజల సౌకర్యార్థం కొరకే ఈ సీఎస్‌పీని ఏర్పాటు చేశామన్నారు. ఈ సీఎస్‌పీ ద్వారా ప్రతి ఖాతాదారుడు రూ.30 వేల వరకు లావాదేవీలు జరుపుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్గొండ ఏట మాడ్యూల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్‌వీటీ, ఎంపీటీసీ శేఖర్‌రెడ్డి, తూం బుచ్చిరెడ్డి, ఆంజనేయులు, రాజ్‌కుమార్ తదితరులున్నారు.

సంత్ సేవాలాల్ మహరాజ్ ఆదర్శప్రాయుడు

- ఎమ్మెల్యే బాలునాయక్


దేవరకొండ : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్


తిరుమలగిరి (సాగర్) : రంగుండ్ల తండాలో ప్రచారరథాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

దేవరకొండ : గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం దేవరకొండలోని బంజారా భవన్‌లో ఆలిండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని గిరిజన నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన జాతిని జాగృతం చేసిన మహానుభావుడు సేవాలాల్ మహరాజ్ అన్నారు. సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడంపై ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఏఐబీఎస్ఎస్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన వేడుకల్లో డీటీడబ్ల్యూఓ రాజ్‌కుమార్, ఆర్డీఓ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ఎంపీపీలు నల్లగాసు జాన్‌యాదవ్, పార్వతి, నేనావత్ రాంబాబునాయక్, జెడ్పీటీసీలు బుజ్జి, బాలు, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ నాయక్, బిక్కునాయక్, దూదిపాళ్ల వేణుధర్‌రెడ్డి, కొర్ర గౌతమి రాంసింగ్, పాపానాయక్, రమావత్ పాండు నాయక్, లక్పతినాయక్, నారాయణనాయక్, ఆయా మండలాల రెవెన్యూ అధికారులు, గిరిజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఈనెల 25న నాగార్జునసాగర్‌లో హిల్‌కాలనీలో నిర్వహించే సంత్‌సేవాలాల్ మహరాజ్ 285వ జయంతిని విజయవంతం చేయాలని ఆలిండియా బంజార సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని రంగుండ్లతండాలోని ఆయన నివాసంలో ప్రచార రథాన్ని ప్రారంభించి మాట్లాడారు. గిరిజనుల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సేవాలాల్ మహరాజ్ అని ఆయన కొనియాడారు. కార్యక్రమానికి గిరిజన యువకులు, మేధావులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ నాయక్, సర్దార్ నాయక్, నరేష్, తులస, కోటి, రవి పాల్గొన్నారు.

యువత సత్ప్రవర్తనతో మెలగాలి


యువకులకు హెయిర్ కటింగ్ చేయిస్తున్న ఎస్‌ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి : యువత సత్ప్రవర్తనతో మెలగాలని కొండమల్లేపల్లి ఎస్‌ఐ రామ్మూర్తి అన్నారు. గురువారం కొండమల్లేపల్లి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రించే క్రమంలో ఇద్దరు యువకులు విచిత్రమైన హెయిర్ స్టైల్‌తో ఉండడాన్ని ఎస్‌ఐ గమనించి వారిని స్వయంగా హెయిర్ కటింగ్ షాప్‌కు తీసుకెళ్లి దగ్గరుండి కటింగ్ చేయించారు. యువత వింత పోకడలకు పోయి అబాసుపాలు కావద్దని సూచించారు. క్రమ శిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చుకొని ఎదుటివారికి ఆదర్శంగా నిలవాలన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

కొండమల్లేపల్లి : మండలంలోని చెన్నారం గ్రామంలో గురువారం చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు రవీంద్రకుమార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, తులసిరాం, వెంకట్‌రెడ్డి, దీప్ల, భద్రు, రమేశ్, కృష్ణ, వెంకటేశ్, విశ్వనాథం, పరిపూర్ణ పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా చంద్రశేఖర్‌రెడ్డి


చంద్రశేఖర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ టౌన్ : మాడుగులపల్లి మండలం కుక్కడం గ్రామానికి చెందిన మైలవరపు చంద్రశేఖర్‌రెడ్డిని జిల్లా ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. ఆ యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆ నియామకపత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, కార్మికులకు ఏ సమస్య వచ్చిన స్థానిక ఎమ్మెల్యే సహకారంతో పరిష్కరిస్తామని తెలిపారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, యూనియన్ జాతీయ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న, జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

విజయ సంకల్పయాత్రను విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి : ఈనెల 28నుంచి నల్లగొండ పార్లమెంట్ పరిధిలోని డిండిలో ప్రారంభించనున్న బీజేపీ విజయ సంకల్ప బస్‌యాత్రను విజయవంతం చేయాలని నల్లగొండ పార్లమెంట్ యాత్ర ప్రముఖ్ పోతెపాక సాంబయ్య కోరారు. గురువారం నిర్వహించిన కొండమల్లేపల్లి మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో రైతులను, నిరుద్యోగులను, మహిళలను, యువతను, పేద ప్రజలను దగా చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చారన్నారు. అనంతరం బీజేపీ రాష్ట్ర నాయకుడు కేతావత్ బీల్యానాయక్ మాట్లాడుతూ ప్రజలు బీజేపీతో నడుస్తున్నారన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అనేక రంగాల్లో అభివృద్ధి చెందిందని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

డిండి : ఈనెల 28న మండల కేంద్రంలో ప్రారంభించనున్న నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతపాక సాంబయ్య నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లాలూనాయక్,మండలాధ్యక్షుడు వాసం నరేందర్‌రెడ్డి, నక్క వెంకటేష్, నరసింహరావు, రాఘవేంద్ర, సాయిగౌడ్ పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషిచేయాలి

పెద్దవూర : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నాటికి బీఎస్పీ బలోపేతమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషిచేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా కార్యదర్శి కొండ లలిత అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన బీఎస్‌పీ మండల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అతిత్వరలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నూతన కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీఎస్పీ మండల నూతన అధ్యక్షుడిగా తుడుం రవీందర్, ఉపాధ్యక్షుడిగా తరి రవికుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు ముందిగొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, సహాయ కార్యదర్శి ముత్యాలు, సత్యనారాయణ, రమేష్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ మార్కుల పరిశీలన

పెద్దవూర : పదో తరగతి ఇంటర్నల్ మార్కులను గురువారం జిల్లా మానిటరింగ్ టీం పరిశీలించింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పదోతరగతి విద్యార్థుల నాలుగు ఎఫ్ఏలలో నమోదు చేసిన ఇంటర్నల్ మార్కుల రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మానిటరింగ్ టీం అధికారులు జెడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎం కె.శ్రీనివాస్, నోవా, శ్రీనివాస్, పాల్గొన్నారు.